అనుదినం జనపక్షం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

గురువారం 19 జనవరి 2023

చెట్టుపై సేద కొంగలు

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండలం మంగల్ పాడు గ్రామ సమీపానగల తుమ్మ చెట్టు ఎండిపోయి ఉంది. చెట్టు పక్కనే పంట పొలాలు ఉన్నందున పంట పొలాల్లో ఉన్న క్రిమీ కీటకాలను కొంగలు ఆరగించి అనంతరం చెట్టు కొమ్మలపై కూర్చుని సేద తీర్చుకుంటున్న దృశ్యాన్ని నవతెలంగాణ క్లిక్‌మనిపించింది.



నల్లని చెట్టుపై.. తెల్లటి కొంగలు

భూ సేకరణ పరిశీలించిన అధికారులు

సమాచారం ఇవ్వలేదని బాధితుల ఆగ్రహం

నవతెలంగాణ-నవీపేట్



జాతీయ రహదారి 161 భూ సేకరణకై అధికారులు యంచ గ్రామంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణంలో ఎటువంటి ఫిర్యాదులున్న రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వచ్చారని ఇచ్చిన నోటీసులలో సైతం తేదీ ఇవ్వలేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు సరైన న్యాయం చేయాల్సిందిగా నాయకులు సంజీవ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవి, ఎమ్మార్వో వీర్ సింగ్, ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టు పోస్టులకూ పైరవీలు

- యూఆర్ఎస్‌లో ఐదు పోస్టులకు దరఖాస్తులు
- అర్హుల జాబితా సిద్ధమైనా ప్రకటించట్లే..
- కలెక్టరేట్‌లో దస్త్రం పెండింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



ప్రభుత్వ కొలువులు లేకున్నా.. కాంట్రాక్టులోనైనా ఉద్యోగాలు చేద్దామనుకుంటున్న నిరుద్యోగుల ఆశలు నెరవేరడం లేదు. జోరుగా పైరవీలు సాగుతుండటంతో అర్హుల్లో ఆందోళన నెలకొంటోంది. దరఖాస్తులు ఆహ్వానించి నెలలు గడుస్తున్నా.. నేటికీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో తమకు ఉద్యోగాలు వస్తాయా? రావా అన్న ఆందోళన నెలకొంటోంది. విద్యాశాఖ ఇటీవల జిల్లా కేంద్రంలోని యూఆర్ఎస్‌లో ఐదు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించింది. కానీ ఇప్పటి వరకు భర్తీ చేయడం లేదు. ఇప్పటికే వెరిఫికేషన్ పూర్తయి.. మెరిట్ జాబితా సిద్ధమైనా ప్రకటన చేయడం లేదు. అయితే ఈ పోస్టులు జోరుగా పైరవీలు సాగుతున్నాయని సమాచారం. అందువల్లే పోస్టులు భర్తీ కావడం లేదని దరఖాస్తుదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నగరంలోని పట్టణ గురుకుల పాఠశాల(అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ బి) ఖిల్లాలో కాంట్రాక్టు విధానంలో పలు పోస్టులను భర్తీ చేసేందుకు 2022లో నవంబర్ నెలలో జిల్లా విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. ఇందులో అకౌంటెంట్-1 (గ్యాడ్యుయేడ్ కామర్స్ అలాగే కంప్యూటర్ పరిజ్ఞానం అనుభవం కలిగి ఉండాలి), అసిస్టెంట్ కుక్ పోస్టులు 2 (ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణతై వంట అనుభవం ఉండాలి), సీఆర్‌టీ సైన్స్(ఎంఎస్సీ, బీఈడీ), పీఈటీ(డిప్లొమో ఇన్ పీఈడీ) అర్హతలుగా పేర్కొన్నారు. స్థానికులకు అధిక ప్రాధాన్యత ఉంటుందని ప్రకటించారు. డిసెంబర్ 4వ తేదీ వరకు దరఖాస్తులు స్వాగతించారు. పోస్టులకు పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఒక్క అకౌంటెంట్ పోస్టుకు సుమారు 20 అప్లికేషన్లు వచ్చాయి. ఒకే పోస్టు ఉండటంతో మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా మెరిట్ జాబితా తయారు చేశారు. స్కూల్ అసిస్టెంట్ల సాయంతో పరిశీలన కూడా పూర్తయ్యింది. కానీ ఈ ఐదు పోస్టులు ఇప్పటి వరకు భర్తీ కాలేదు. మరోవైపు యూఆర్ఎస్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. సిబ్బంది కొరత వల్లే దరఖాస్తులు ఆహ్వానించిన నేపథ్యంలో.. భర్తీ చేసేందుకు ఎందుకు కాలయాపన చేస్తున్నారని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

కలెక్టర్ వద్ద ఫైల్ పెండింగ్..

పోస్టులు భర్తీకి సంబంధించి డీఈఓను వివరణ కోరగా.. ఈ దస్త్రం ప్రస్తుతం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. అయితే పైరవీలు సాగుతున్న విషయమై వివరణ కోరగా.. అలాంటిదేమీ లేదని అన్నారు. మరోవైపు లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. పోస్టుల భర్తీలో జాప్యం జరుగుతుండటంతో తమకు ఉద్యోగాలు వస్తాయా రావా అన్న ఆందోళన నెలకొంది. జిల్లా కలెక్టర్ స్పందించి అర్హులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మల్లిఖార్జున్‌పై దాడి కేసులో

ముగ్గురి అరెస్ట్

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు

నవతెలంగాణ-బోధన్

కోటగిరి మండల కేంద్రంలో తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్ తనకు పాఠశాలలో విధి నిర్వహణలో ఉండగా కొంతమంది వచ్చి ఉద్దేశపూర్వకంగా దేవుళ్లను అవమానపరిచినట్లు పేర్కొంటూ బలవంతంగా గుడిలో తీసుకెళ్లి బొట్టుపెట్టి అవమానించిన ఘటనలో ఉపాధ్యాయుడు మల్లికార్జున్ పలువురిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును కోటగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారించిన ఏసిపి కిరణ్ కుమార్ పదిమందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేశారు. అందులో భాగంగా బుధవారం ముగ్గురు రమేష్, సాయిబాబు, వర్షిత్‌ను అరెస్టు చేసి బోధన్ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా వారికి న్యాయమూర్తి బెయిలు మంజూరు చేసినట్టు ఏసీపీ తెలిపారు. పరారీలో ఉన్న ఏడుగురిని రెండు మూడు రోజుల్లో అరెస్టు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్ ను కొంతమంది మతం పేరిట ఆహ్వానించడంతో ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేకెత్తింది. నిందితులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పలు ప్రజాసంఘాలు ఉద్యమించాయి.

ఆలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని కేలూర్ గ్రామంలో వాల్మీకి మహర్షి ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తుండటంతో ఈ ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ మండలాధ్యక్షులు సంగమేశ్వర్, కేలూర్ గ్రామపెద్దలైన ఎంపీటీసీ సభ్యులు విజయ్, సలాబత్‌పూర్ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలు గౌడ్‌కు రూ.11,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణాన్ని కెలూరులో నిర్మించడం పట్ల ఆయన ఆ గ్రామస్తులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌పై లోకాయుక్తలో రైతుల ఫిర్యాదు

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌పై లోకాయుక్త కేసు నమోదు చేసినట్టు రైతు ఐక్య కార్యచరణ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా రైతుల ఉద్యమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్, కలక్టరేట్ లకు వచ్చిన రైతుల పట్ల నిర్లక్ష్యం వహించినదుకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మాస్టర్ ప్లాన్ విషయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నందున ఉద్యమాల చేశామని మాస్టర్ ప్లాన్ చేసేటప్పుడు రైతులకు జోన్‌ల విషయంలో కనీస అవగాహన కల్పించలేదని తర్వాత ఉద్యమం చేసేటప్పుడు కార్యాలయాలకు రైతులు వస్తె కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. దాదాపు 2వేల మంది రైతులు ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు వస్తే కనీసం వినతి పత్రం తీసుకోలేదని, కనీసం 5 నిమిషాల సమయం ఇవ్వని కలెక్టర్ తీరు పట్ల లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

నాగన్నగారి బావిని సందర్శించిన ఆర్డీఓ



బావిని పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గల నాగన్న గారి బాయిని ఎల్లారెడ్డి ఆర్‌డిఓ శ్రీనివాస్ నాయక్ సందర్శించారు. చారిత్రక కట్టడమైనటువంటి నాగన్న గారి బావిలోనికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నాగన్న గారి బావిని పునర్నిర్మాణం చేపట్టడానికి ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తారని అన్నారు. చారిత్రక కట్టడమైనటువంటి నాగన్న గారి బాయి పర్యాటక కేంద్రంగా మార్చడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఎమ్మార్వో మారుతి, ఎంపిఓ ప్రభాకర్ చారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, లింగంపేట్ కార్యదర్శి రాజేందర్, రవి గౌడ్, తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలి



నోటీసులు అందజేస్తున్న సీఐ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్

ఇటీవల బ్యాంకు, ఏటీఎంలో జరుగుతున్న నేరాల దృష్ట్యా ఎల్లారెడ్డి పరిధిలోని బ్యాంకులు, ఏటీఎంలు, గోల్డ్‌లోన్ సంస్థల వారు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎల్లారెడ్డి ఎస్ఐ గణేష్ తెలిపారు. బుధవారం పలు సూచనలతో కూడిన నోటీసులు ఇచ్చినట్టు వివరించారు. ప్రతి బ్యాంకు, గోల్డ్‌లోన్ సంస్థలు, వారి సంస్థలోపల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, మంచి లైటింగ్, పగలు, రాత్రి సెక్యూరిటీ గార్డ్, ఎల్లప్పుడూ పనిచేసే అలారం సిస్టం, కిటికీలు ఇనుప గ్రిల్స్‌తో పటిష్టంగా ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలు బ్యాంకులలో, గోల్డ్‌లోన్ సంస్థలలో దాచుకున్న డబ్బు, బంగారం పట్ల ఆయా యాజమాన్యాలు బాధ్యతతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేనియెడల వారిపై తెలంగాణ పబ్లిసిటీ సేఫ్టీ మెసర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆక్ట్ 2013 ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గోల్డ్‌షాప్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

లింగంపేట్ : గోల్డ్‌షాప్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు ఏఎస్ఐ నోటీస్ అందించారు. బుధవారం ఇటీవల బ్యాంకు, ఏటీఎంలో జరుగుతున్న దొంగతనాలు దృష్ట్యా లింగంపేట్ పరిధిలోని బ్యాంకులు, ఏటీఎంలు, గోల్డ్‌షాప్ దుకాణదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ శంకర్ సూచించారు. బుధవారం దుకాణ నిర్వాహకులకు వారికి సూచనలతో కూడిన నోటీసులు అందజేశారు.

అప్పుల ఊబిలోకి పసుపు రైతులు

- పసుపు పంటకు కనీసం రూ.15 వేల మద్దతు ధర కల్పించాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న మూడ్ శోభన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలతో పసుపు రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారనితెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధర క్వింటాల్ రూ.15000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీ అరవింద్ పసుపు రైతులను మోసం చేశాడని మండిపడ్డారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నిజామాబాద్ ఎంపిగా గెలిచిన అరవింద్ పసుపు రైతులకు తాను ఎన్నికలలో గెలిచిన 5 రోజులలో బోర్డు తెప్పిస్తానని ప్రామిసరి నోట్ పై ఆగ్రిమెంట్ రాసిచ్చాడు. గెలిచిన తరువాత వీరు నేటి వరకు ఆ సమస్యను పట్టించుకోలేదు. పసుపు పండించిన రైతులకు గిట్టుబాటు ధరలేక అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. పసుపు పంట ఖరీదైంది. ఎకరాకు సుమారు రూ. 1.50 లక్షలు ఖర్చవుతుంది. దిగుబడి 15 నుంచి 20 క్వింటాలకు మించడం లేదు. మార్కెట్‌లో మాత్రం క్వింటాలుకు రూ.5వేలు మాత్రమే రైతులకు లభిస్తున్నది. రైతులకు పెట్టుబడి కూడా చేతికి రావడం లేదు. దీనివల్ల పసుపు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో పసుపు పంట సాగు తగ్గింది. పసుపు కొనుగోళ్లకు పసుపు బోర్డును ఏర్పాటు చేసి దాని ద్వారా విదేశాలకు ఎగుమతి చేయాలి. పసుపు మద్దతు ధర రూ.15 వేలు నిర్ణయించాలని, పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని, స్పైసెస్ బోర్డు రీజనల్ కార్యాలయంతో రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ప్రత్యేక బోర్డు, మద్దతు ధర హామీలను నిలబెట్టుకోవాలి. ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని' కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శ పల్లపు వెంకటేష్ పాల్గొన్నారు.

స్పీడ్ పెరిగితే రెడ్‌లైట్

- స్పీడ్ బ్యాక్ బోర్డ్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ

నవతెలంగాణ-భిక్కనూర్



హైవే పక్కన ఏర్పాటు చేసిన బోర్డు

మండలంలోని 44వ జాతీయ రహదారిపై ఓ రెస్టారెంట్ వద్ద స్పీడ్ బ్యాక్ బోర్డ్‌ను జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాల స్పీడును స్పీడ్ బ్యాక్ బోర్డులో కనిపిస్తుందని, నిర్ణయించిన 80 స్పీడ్ కంటే ఎక్కువగా వెళితే రెడ్‌లైట్ వెలుగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోనే స్పీడ్ బ్యాక్ బోర్డు మొదటి సారిగా భిక్కనూర్ మండలంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసినట్టు తెలిపారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా అవసరమైన ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పది రోజులకు ఒకసారి స్పీట్ బ్యాగ్ బోర్డును రెండు వైపులా మార్చునున్నామని, జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాల స్పీడ్ స్పీడ్ బ్యాక్ బోర్డులో నిక్షిప్తమై ఉంటుందని తమ వాహనాలు ఎంత వేగంగా వెలుతుందో బోర్డులో చూసుకోవచ్చని తెలిపారు. త్వరలోనే అతివేగంగా వెళ్తున్న వాహనాలకు స్పీడ్ బ్యాక్ బోర్డ్ ద్వారా జరిమానా విధించే విధంగా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి వాహన దారుడు వాహనాలు నడుపుతున్న సమయంలో కారు డ్రైవింగ్ సమయంలో సీట్ బెల్ట్, ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానా విధించి, జైలుకు పంపిస్తామని స్పష్టంచేశారు. వాహనదా రులు తమ వాహనాల నెంబర్‌ప్లేట్లను సక్రమంగా ఉంచుకోవాలని, నెంబర్ ప్లేట్ సరిగ్గా కనిపించకపోయినా, అక్షరాలను తమ ఇష్టానుసారంగా చిన్నగా పెద్దగా ఏర్పాటు చేసినా వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. వాహనాలు నడుపుతున్న సమయంలో వాహన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి అన్యోన్య డీఎస్పీ సోమనాథం, సీఐ తిరుపయ్య, ఎస్‌బి సిఐ వీరయ్య, ఎస్ఐ ఆనంద్ గౌడ్, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అడ్డూ అదుపులేని పేకాట

నవతెలంగాణ-బోధన్



సాలూర మండలంలోని సాలూర శివారు ప్రాంతం, స్థానిక పాఠశాల పక్కన పాడుబడిన భవనంలో, మందర్న గ్రామంలోని శివారు ప్రాంతంలో జోరుగా పేకాట అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతోంది. బోధన్ ఉమ్మడి మండలం నుంచి పేకాటరాయుళ్లు ప్రతిరోజు పేకాట కోసం రావడం పరిపాటిగా మారింది. అలాగే సమీప మండలాల నుంచి సైతం కార్లలో పేకాట రాయుళ్లు వస్తున్నట్టు సమాచారం. ఈ పేకాటలో లక్షల రూపాయలు ఆట కొనసాగుతున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. నిర్వహకులు ప్రతి ఆటకు వేల రూపాయలు వసూలు చేస్తూ నిరంతరాయంగా ఆటను కొనసాగిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. పేకటరాయుళ్ల కోసం నిర్వాహకులు వారు కోరిన మద్యం, మాంసాహారం వారి వద్దకు తెచ్చిస్తుండడంతో పేకాట దర్జాగా కొనసాగుతుంది. అంతేకాకుండా పేకాట వద్దకు పోలీసులు కాని కొత్త వ్యక్తులు కాని ఎవరైనా అటువైపు వస్తే సమాచారం చేరవేయడానికి నిఘా బృందం పనిచేస్తున్నట్టు సమాచారం. నిఘా బృందంలో పని చేసే వారికి రోజుకు 500 నుంచి 1000 రూపాయలు వరకు చెల్లిస్తూ వారికి భోజనం సైతం అందిస్తున్నట్టు సమాచారం. పోలీసు శాఖ నామమాత్రంగా చర్యలు చేపట్టడంతో పేకాట రాయుళ్లకు ఇది మామూలు ఆట అయిపోయింది. ఎన్నిసార్లు పోలీసులకు పట్టుబడినా తిరిగి వచ్చి యథావిధిగా ఆటను కొనసాగిస్తున్నారు. మందర్న శివారులో రోజుకు లక్షల రూపాయల పేకాట కొనసాగుతుందని సమాచారం.

రహస్యంగా మట్కా నిర్వహణ..

సాలురా పరిసర ప్రాంతంలో జూదంతోపాటు మట్కాను సైతం రహస్యంగా నిర్వహిస్తున్నారు. సమీపంలోని మహారాష్ట్ర ప్రాంతంలో కొనసాగుతున్న మట్కా సాలూరాకు చేరింది. దాంతో ఓ కాలనీలో యువకులు మట్కాకు బానిసై ప్రతిరోజు వేల రూపాయలు పోగొట్టుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. అదే కాలనీకి చెందిన కొంతమంది రహస్యంగా దీనిని నిర్వహిస్తున్నారు. గతంలో పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేసిన తీరు మారడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. యువత జూదం, మట్కా, ఐపీఎల్ పందేములకు బానిస కావడంతో వారి కుటుంబాలలో కలహాలు చోటుచేసుకుంటున్నాయి. మట్కా, పేకాటతో చాలామంది ఆస్తులను కోల్పోతున్నా ఈ ఆటకు బానిస కావడంతో ఈ వ్యసనం మానడం లేదని పలువురు వాపోతున్నారు. పోలీసులు ఈ ప్రాంతంలో నిఘా వేసి పేకాట నిర్వాకులపై, మట్కా నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు మరింత కఠినంగా వ్యవహరించాలని గ్రామస్తులు, ఆయా బాధిత కుటుంబాలు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న చక్రపాణి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, రూ.2000 వేతనం అమలు చేసేందుకు వెంటనే జీవో జారీ చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం మార్చి 15న ముఖ్యమంత్రి మధ్యాహ్న భోజన కార్మికులకు 2000 రూపాయలు జీతం పెంచుతున్నట్టు ప్రకటించి ఇప్పటికీ అమలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వం జీతం పెంచుతదనే ఆశతో కార్మికులు వెట్టిచాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు చామంతి, లక్ష్మి, జక్కం సుజాత, సాయమ్మ, నాగలక్ష్మి, సురేందర్ రెడ్డి, గంగాధర్ కార్మికులు పాల్గొన్నారు.

సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



ఎంపీ బీబీపాటిల్‌తో ఎల్లారెడ్డిమున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-లింగంపేట్/లింగంపేట్

ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన భారత రాష్ట్ర సమితి బహిరంగ సభకు లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున బుధవారం బయలుదేరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశానుసారం వాహనాల్లో తరలివెళ్లారు. బయలుదేరిన వారిలో లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ కూచంపల్లి దేవేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బండి రాజయ్య, సర్పంచులు అనిల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సర్వం నాయక్, ఎంపీటీసీ సురేందర్, మాజీ వైస్ ఎంపీపీ సంగయ్య, బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు బయలుదేరారు.

ఎల్లారెడ్డి : బీఆర్ఎస్ పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని భారత దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్‌గా మార్చిన అనంతరం తొలి సభ ఖమ్మంలో నిర్వహించడంతో సభకు ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. సభ వద్ద బుధవారం జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్‌తో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎల్లారెడ్డికి చెందిన కౌన్సిలర్లు రాము, ఎంపీటీసీ సంతోష్, బీఆర్ఎస్ నాయకులు శ్రవణ్‌కుమార్, రాజు, అరవింద్‌గౌడ్, ఇమ్రాన్ తదితరులు తరలివెళ్లారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి



జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అమృతపూర్ ఒడ్డెర క్యాంప్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కచ్చుకాయల గణేశ్ వివరాల ప్రకారం.. మండలంలోని అమృతపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఒడ్డెర కాలనీకి చెందిన ఏర్ల నరేష్ (27) గత కొంత కాలం నుండి మానసిక స్థితి సరిగ్గా లేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం అర్ధరాత్రి రాత్రి 2 గంటల సమయంలో తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి వెంకటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు డిబార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరిగిన యూజీ 4వ సెమిస్టర్ (బ్యాక్‌లాగ్) పరీక్ష లో 1803మంది విద్యార్థులకు గాను 1690 మంది హాజరయ్యారని, 113మంది గైర్ హాజరు అయ్యారనితెలంగాణ యూనివర్సిటీ పరిక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణా తెలిపారు. బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో కార్పొరేట్ అకౌంటింగ్ పరీక్ష లో ఒకరు, ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో కార్పొరేట్ అకౌంటింగ్ పరీక్ష లో మరొక విద్యార్థి డిబర్ అయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన 3వ సెమిస్టరు (రెగ్యులర్) పరీక్షలలో 8884 గాను 8212మంది హాజరయ్యారని 62మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని కోనసముందర్ గ్రామమానికి చెందిన గమ్మత్ రత్నాకర్(33) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ రాజశేఖర్ వివరాల ప్రకారం.. ఈనెల 15న స్నేహితుడిని కలవడానికి మండలంలోని బషీరాబాద్ గ్రామమానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. బషీరాబాద్ శివారులోని కాడిచెరువు గంగమ్మ గుడి సమీపంలో ప్రమాదవషాత్తు రత్నాకర్ బైక్ పై నుండి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో రత్నాకర్ తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ఆయన్ను ఆర్మూర్‌లోని ఎంజి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడినుండి హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య మహాశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాహన దొంగల అరెస్ట్

- 12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దొంగతనాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ లో ఇటీవల 12 ద్విచక్ర వాహనాలను దొంగలించి అమ్మడానికి ప్రయత్నిస్తున్న వారిని పట్టుకున్నారు. ఏసీపీ వివరాలను వెల్లడించారు. ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లిలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తూండగా ద్విచక్ర వాహనాల దొంగలను పట్టుకున్నారని వివరించారు. ఇందల్‌వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని తిర్మన్‌పల్లి గ్రామంలో 24 డిసెంబర్, 07జనవరి, 14 జనవరిన మూడు ద్విచక్ర వాహనాల దొంగతనం చేశారని తెలిపారు. ఇద్దరు నేరస్థులపై ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ లో మూడు కేసులు, నిజామాబాద్ ఒకటవ టౌన్ లో ఒక కేసు, నిజామాబాద్ రూరల్ డిచ్ పల్లి, కామారెడ్డి, సిరిసిల్ల పోలీస్ స్టేషన్ల ఏరియాలలో 9 మోటార్ సైకిళ్లను దొంగలించినట్లు విచారణలో నిందితులు ఒప్పుకున్నారని అన్నారు. బోధన్ పట్టణానికి చెందిన మలావత్ తులసిరామ్, రాథోడ్ వినోద్‌ను పట్టుకున్నామని తెలిపారు. వారు దొంగలించిన 12 ద్విచక్ర వాహనాల ను రికవరీ చేశామన్నారు. వాటి విలువ 4 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. మొదటి నేరస్తుడు తులసి రామ్ గతంలో జైలుకు వెళ్లి వచ్చారని, వీరిపైన పిడి యాక్ట్ కేసులు పెట్టి శాశ్వతంగా జైల్లో ఉండే విధంగా కేసులు పెడతామని తెలిపారు. ఇద్దరు ద్విచక్ర వాహనాల దొంగలను పట్టుకోవడానికి డిచ్‌పల్లి సీఐ మోహన్, ఇందల్ వాయి ఎస్సై నరేష్, పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్, గణేష్, రాజేశ్వర్, రాజేందర్‌కు రివార్డుతోపాటు అవార్డు కూడా పోలీస్ కమిషనర్ కెఆర్ నాగరాజు అందజేయడం జరుగుతుందని ఏసీపీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో డిచ్‌పల్లి సీఐ మోహన్, ధర్పల్లి సీఐ ఇందల్‌వాయి ఎస్సై నరేష్, సిబ్బంది రాజేశ్వర్, గజేందర్, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహన చోరులను అరెస్టచేసి వాహనాలు స్వాధీనం చేసుకున్న పో లీసులు

25న బీఎల్ఎఫ్ రాష్ట్ర ఆవిర్భావ సభ

- రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 25న బీఎల్ఎఫ్ 5వ రాష్ట్ర ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లో గల కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో బహుజన రాజ్యాధికారం సాధన లక్ష్యంగా ఏర్పడిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్-బిఎల్ఎఫ్ దళిత, బహుజన ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. బహుజన సామాజిక వర్గాల సమస్యలు పరిష్కారం కావాలంటే తెలంగాణ సమాజంలో 93శాతమున్న బహుజన సామాజిక వర్గాలు రాజ్యాధికారంలోకి వేస్తేనే సాధ్యమవుతుందని అన్నారు. ఓంకార్ భవన్ హైదరాబాద్‌లో సభ ఉటుందని తెలిపారు. బీఎల్ఎఫ్ ను రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర సభలో తీర్మానాలు చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కన్వీనర్లు కె.శ్రీనివాస్, మేత్రి రాజశేకర, ద్యారంగుల రాజుతో కలిసి పాల్గొన్నారు.

గ్రూప్స్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

గ్రూప్-2,3,4 సర్వీసెస్‌కు దరఖాస్తు చేసుకున్న నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ఎస్సీ డెవలప్మెంట్ అధికారి శశికళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలియజేశారు. మూడు నెలల కాలానికి టీఎస్‌పీఎస్‌సీ స్టడీ సర్కిల్, షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ నిజామాబాద్ ఉచిత కోచింగ్ ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ఈనెల 17నుండి 31లోగా ఆన్ లైన్‌లో దరఖాస్తులు కోరారు.

విద్యార్థి దశ చాలా కీలకం

నవతెలంగాణ-సిరికొండ

జీవితంలో విద్యార్థి దశ ప్రతి ఒక్కరికి కీలకమైనదని ధర్పల్లి సీఐ బి.సైదా అన్నారు. బుధవారం సత్యశోధక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదోతరగతి 2022 బ్యాచ్ కి చెందిన మండల టాపర్ లకు నగదు ప్రోత్సాహకాలు సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చిన్న నర్సయ్య స్మారక పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ సైదా మాట్లాడుతూ విద్యార్థిలో ఉత్తమ ఆలోచనలు ఉన్నత స్థాయికి చేర్చుతాయని, క్రమశిక్షణ, సహనశీలత, సత్ప్రవర్త నను అలవర్చుకోవాలని, పట్టుదల అంకిత భావంతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాలను తప్పక చేరుకుంటారని విద్యార్థులకు వివరించారు. విద్యార్థు ల్లోని ప్రజ్ఞ, సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తే వినూత్న ఆలోచనలతో భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. పదవ తరగతి 2022 లో ఉత్తమ జీపీఏ 10 సాధించిన సత్యశోదక్ విద్యార్థులు వి.రక్షిత, జి.దీక్షిత, ఏంజెపిఆర్ఎస్ చీమన్ పల్లి విద్యార్థులు సిహెచ్ గోపి,ఎస్ పల్లవి,టీఎస్ఎంఎస్ సిరికొండ విద్యార్థులు పి.సౌందర్య, కే.శ్రీనితకు సత్యశోధక్ చిన్న నర్సయ్య స్మారక నగదు పురస్కారం రెండువేలు ఒకరికి, ప్రత్యేక జ్ఞాపిక, ప్రశంస పత్రాలు, జాతీయ జంబోరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్యశోదక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మెన్ రావుట్ల నర్సయ్య, ఏఎస్సై బాలసింగ్, తెలంగాణ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బాలయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



నగదు పుస్కారాలు , బహుమతులు అందజేసిన సీఐ

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని రెండో వార్డులో సిక్కుల కాలనిలో నివసించే బౌరి పూనం కౌర్ కు కల్యాణ లక్ష్మి చెక్కును మున్సిపల్ కౌన్సిలర్ ప్రముఖ మహిళా న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్ సంగీత ఖాందేష్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమములో బీఆర్ఎస్ నాయకులు ఖాందేష్ సత్యం, బండారి నరేశ్, హర్భజన్ సింగ్, మేతాబ్ సింగ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న కౌన్సిలర్

దొడ్డి భారతి జ్ఞాపకార్థం విద్యార్థులకు సహకారం



నోట్‌బుక్‌లు పంపిణీ చేస్తున్న

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని సిరన్ పల్లి సర్పంచ్ సుధాకర్ రావు సతీమణి దొడ్డి భారతి జ్ఞాపకార్థం మండలంలోని మద్దేపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం నోట్ బుక్కులు, పెన్నులు, షూస్‌లతోపాటు పాఠశాలకు బీరువాను అందజేశారు. దొడ్డి భారతి 12వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు సహకారం అందించడం ఎంతో గొప్ప విషయమని ఎంఈఓ గణేష్ రావు, వైస్ ఎంపీపీ ఇందూర్ హరీష్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు కిషన్ రావు, రవి, ఉపాధ్యాయులు గోవర్ధన్, హన్మారెడ్డి, కుటుంబ సభ్యులు సుజన్ కుమార్, అర్చన, సుచరిత, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని దోంచంద గ్రామంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ గడ్డె రాధ గంగారం, ఉప సర్పంచ్ సోమిరెడ్డి శ్రీనివాస్, తాళ్ళ రాంపూర్ సొసైటీ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. కంటి వైద్యులు కె.ప్రియాంక, ప్రశాంత్, కొమిరేష్ 120 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఈటీ.అఖిల, సీఎఫ్ రాజేష్, శ్రీనివాస్, మధు, సాయి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మహిపాల్‌రెడ్డి వర్ధంతి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మాజీ అటవీశాఖ మంత్రి స్వర్గీయ ఏలేటి మహిపాల్‌రెడ్డి 32వ వర్ధంతి సందర్భంగా మండలంలోని చౌట్‌పల్లి గ్రామంలో సమాధి వద్ద కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. మహిపాల్ రెడ్డి సతీమణి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ , తనయులు బీజేపీ బాల్కొండ నాయకులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, ఏలేటి నాగార్జున్ రెడ్డి మహిపాల్ రెడ్డి సమాధి వద్ద జ్యోతిని వెలిగించి, సమాధిపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కాన్నగారి మోహన్, నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్, బీజేపీ కమ్మర్ పల్లి మండల అధ్యక్షులు కట్ట సంజీవ్ కుమార్, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నివాళ్ళు అర్పిస్తున్న అన్నపూర్ణమ్మ, తదితరులు

టీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీల నియామకం



నియోమక పత్రాలు అందజేస్తున్న ఎపీపపీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని సికింద్రాపూర్. పుప్పాలపల్లి, గాన్యతండా, బాలానగర్ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీలను నియమించినట్టు ఎంపీపీ కుంచాల విమల రాజు తెలిపారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశాల మేరకు పార్టీ మండల ప్రెసిడెంట్ నట్ట భోజన్న, ముఖ్య అతిథులుగా ఎంపీపీ కుంచల విమల రాజు. జడ్పిటిసి తనుజ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతి రెడ్డి, మండల రైతు సమితి అధ్యక్షులు శ్రీనివాస్, మండల సీనియర్ నాయకులు మైదం రాజన్న దేవరాజ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు, ఇరుగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, టీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-మాక్లూర్

ఆలూరు మండలంలోని కల్లెడ గ్రామంలో నేడు ప్రారంభించనున్న కంటి వెలుగు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి బుధవారం పరిశీలించారు. ప్రజలందరు కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి వెలుగు కేంద్రానికి వచ్చిన ప్రజలకు అన్నిసౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ప్రజలకు కంటి వెలుగు పథకం యొక్క విశిష్టతను తెలియజేయాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ శంకర్, ఆలూరు తహశీల్దార్ దత్తాద్రి, ఎంపిడిఓ క్రాంతి, ఎంపిఓ శ్రీనివాస్, ఉపసర్పంచ్ పుంజు మనీష్ గౌడ్, నాయకులు సుధాకర్ నాయకులు పాల్గొన్నారు.

పార్ట్ టైం అధ్యాపకుల నియామకానికి రాత పరీక్ష



పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాలలో బుధవారం జరిగిన ఎంఎడ్ పార్ట్ టైం అధ్యాపకుల నియామక రాత పరీక్షను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రాత పరీక్ష తరువాత తెలంగాణ యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలకు 20 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.

నేడు కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

కంటి వెలుగు కార్యక్రమం నిజామాబాద్ మండలంలోని గ్రామపంచాయతీలో ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో మల్లేష్ బుధవారం తెలిపారు. మండలంలోని మల్లారం, మల్కాపూర్ (ఎం) గ్రామాల్లో గురువారం ఉదయం 8:45 నిమిషాలకు ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి సకాలంలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

కార్యవర్గానికి సన్మానం



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న చైర్మన్

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని పల్లికొండ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని ఎస్ఎంసి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకున్న గ్రామకమిటీ కార్యవర్గాన్ని సన్మానించారు. అధ్యక్షుడు మారిపెద్ది గణేష్, కోశాధికారి దొన్కంటి కిషన్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను చైర్మన్ దేవన్‌పల్లి సుమన్‌లు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్, ఉపాధ్యాయులు, ఎస్ఎమ్‌సీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వడ్డెర సంఘం నాయకులు



పరామర్శిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మాక్లూర్

ఆలూర్ మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన దండుగుల పోశెట్టి అనే వ్యక్తి దుబాయిలో ప్రమాదవశాత్తు మృతి చెందడంతో వారి కుటుంబాన్ని రాష్ట్ర వడ్డెర వృత్తిదారుల సంఘం నాయకులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వడ్డెర వృత్తిదారుల సంఘం అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ. 5 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. చనిపోయిన దండుగుల పోశెట్టి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఒక డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దేరంగుల కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఇడగొట్టి చిన్న ఒడన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఎత్తరి చందర్, జిల్లా కమీటి సభ్యులు గుంజెబిపాపన్న, ఇడగొట్టి రమేష్, గోగుల ఏల్లయ్య, కంది సాయిలు, ముద్దంగుల రమేష్, కంది ఎల్లయ్య ,తదితరులు పాల్గొన్నారు.

27న అంగన్వాడీ ఉద్యోగుల ధర్నా జయప్రదం చేయండి

సీఐటీయూ


నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 27న నిర్వహించే అంగన్వాడి ఉద్యోగుల ధర్నా జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటీవల అంగన్వాడి కమిటీలో తీసుకున్న నిర్ణయాల అమల్లో భాగంగా ఐసీడీఎస్ రక్షణకు అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27న ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నాలకు పిలుపు నిచ్చినట్టు తెలిపారు. అంగన్వాడీ టీచర్లందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఫిబ్రవరి 13న కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు మహేష్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌కు నిధులు తగ్గించటం, ప్రైవేటీకరణకు చర్యలు చేపట్టటం వలన అంగన్వాడీ ఉద్యోగుల భద్రతకే ప్రమాదం వచ్చే పరిస్థితి వచ్చిందని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల ఐసీడీఎస్ నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఉందని, అందువల్ల బడ్జెట్లో నిధులను పెంచి బలోపేతం చేయాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ యాప్ ను రద్దు చేసి ఆన్లైన్ విధానాన్ని రద్దు చేయాలని, అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించి రిటర్మెంట్ బెనిఫిట్స్‌ను ఐదు లక్షలు చెల్లించాలని తెలిపారు. సగం పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలని, 2017 నుండి బకాయిలు ఉన్న టి,ఏ.డీ,ఏ.లు ఇంక్రిమెంట్లు ఇన్చార్జ్ అలవెన్సులు, సుప్రీంకోర్టు తీర్పు కనుగుణంగా గ్రాట్యుటీ చెల్లించాలని, అంగన్వాడీ ఉద్యోగులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయాన్ని కల్పించాలని, చనిపోయిన అంగన్వాడీ కార్యకర్తలకు అంత్యక్రియల ఖర్చుల కొరకు 50 వేలు ఇవ్వాలని, తదితర డిమాండ్లతో తలపెట్టిన ఆందోళనలలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే దేశవ్యాప్త సమ్మెకు అంగన్వాడీ ఉద్యోగులు సిద్ధపడతారని ఆయన హెచ్చరించారు. సమావేశంలో అంగన్వాడి అధ్యక్ష ,కార్యదర్శులు కైరి దేవగంగు, పి స్వర్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పి చంద్రకళ, సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, అంగన్వాడి జిల్లా నాయకులు వాణి, గోదావరి, జ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్‌బాబు

ముప్కాల్ వీడీసీ కార్యవర్గం ఎన్నిక



నూతన వీడీసీ కార్యవర్గం

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ నూతన గ్రామాభివృద్ధి కమిటీ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కంచు విజయ్, సెక్రటరీగా బద్దం అశోక్ రెడ్డి, కోశాధికారిగా కొత్తపల్లి శంకర్, ఉపాధ్యక్షులుగా నేర స్వామి, జాయింట్ సెక్రటరీగా కన్నయ్యను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కంచు విజయ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షులుగా నియామకం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముప్కాల్ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, మాజీ వీడీసీ అధ్యక్షులు ముస్కు నర్సయ్య, సభ్యులు గద్దల గంగాధర్, ఆనంద్ గౌడ్, గోవర్ధన్, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

హసన్‌టాక్లిలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలోని హసన్‌టాక్లి గ్రామంలో మెడికవర్ హస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు ఉచిత వైద్య సహాయం అందించాలనే ఆశయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సర్పంచ్ గీత లాలు, ఉప సర్పంచ్ వివరించారు.

తహసీల్దార్లను సన్మానించిన డీసీసీ ఉపాధ్యక్షుడు



నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న, ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు నర్సింలు, ప్రేమ్‌కుమార్‌ను డీసీసీ ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి శాలువాతో సన్మానించి, మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనూష, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ప్రేమ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి కంటివైద్య శిబిరాలు
- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

రెంజల్ : ఈనెల 19 నుంచి జరిగే కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్ కుమార్ స్పష్టం చేశారు. రెంజల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో, నీలా గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాట్లను పూర్తి చేశామని ఆయన పేర్కొన్నారు. ఒక్కొక్క టీంలో పదిమంది వైద్య బృందం పాల్గొంటారని ఆయన తెలిపారు. కంటి వెలుగు 2 కార్యక్రమం గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. ఇది 100 రోజులపాటు కొనసాగుతుందని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కొక్క టీంలో రోజుకు 180 మందికి పరీక్షలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి పరీక్షల అనంతరం కంటి అద్దాలతో పాటు ఉచిత మందులను అందజేయనున్నట్టు వివరించారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి బోధన్ లేదా నిజామాబాద్ ఆసుపత్రికి తరలించి ఆపరేషన్లు చేయనున్నట్టు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంటి వెలుగు వైద్యాధికారిని కావ్య, హెచ్‌ఈఓలు కరిపే రవీందర్, శ్రావణ్‌కుమార్, సూపర్‌వైజర్ మాలంబి, పీహెచ్‌ఎన్ రాణి, ఫార్మసిస్ట్ రామచందర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రెంజల్ : ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



పిట్లంలో..

రామారెడ్డి : తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని బుధవారం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు.

పిట్లం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు మండల ప్రత్యేక అధికారి భరత్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీలో 2వ విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని అట్టహాసంగా గురువారం ప్రారంభించనున్నామని, అందుకుగానూ టెంటు, నీటి సౌకర్యం, కుర్చీలు, బెంచీల సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, బాబు సింగ్, తాహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీఓ బ్రహ్మం, డాక్టర్ శివకుమార్, క్యాంపు మెడికల్ ఆఫీసర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని అమర్లబండలో కంటివెలుగు ఏర్పాట్లను డీఐఓ అనిల్‌కుమార్ బుధవారం పరిశీలించారు. గురువారం నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధన్‌పాల్, ఇంచార్జీ ఎంపీడీఓ సురేందర్‌రెడ్డి, వైద్యాధికారి అస్మా అఫ్రిన్, ఎస్ఐ రాజు, సీహెచ్‌వో నాగరాజు, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : మండలంలోని అజమాబాద్, కళ్యాణి గ్రామ పంచాయతీలలో గురువారం నిర్వహించబోయే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను ఎంపీపీ మాధవి బాల్‌రాజ్‌గౌడ్ పర్యవేక్షించారు. ఆయా గ్రామాలలో పర్యటించారు. కంటి వెలుగు కోసం ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం మత్తమాల ఆరోగ్య కేంద్రం డాక్టర్ శరత్‌కుమార్‌తో మాట్లాడారు. కంటి వెలుగు పరీక్షల కోసం అన్ని రకాల సదుపాయాలు, ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల మందుగోలీలు, చుక్కల మందులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో నారాయణ, ఎంపీవో ప్రకాష్, రెండు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులు ప్రారంభించిన ఎంపీపీ



డ్రయినేజీ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీ రాజలింగం, ఎంపీడీవో అనంతరావు, ఎంపీటీసీ కోడూరి సాయగౌడ్‌తో కలిసి డ్రయినేజీ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండల పరిషత్ నిధుల నుంచి ఎంపీటీసీ కోడూరి సాయగౌడ్ కేటాయించిన మూడు లక్షల నిధులతో డ్రయినేజీ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు గ్రామస్తులు తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ రాజాగౌడ్, ఎంపీటీసీ మంజుల రాములు, టీఆర్ఎస్ నాయకులు రాజు, సతీష్‌రెడ్డి, రాములు, ఎంపీఓ ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, వార్డుసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ తహసీల్దార్‌గా ప్రేమ్‌కుమార్

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ తహసీల్దార్‌గా ప్రేమ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు విధులు నిర్వహించిన నర్సింలు బదిలీపై బీబీపేట్ మండలానికి వెళ్లారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. రెవెన్యూ సంబంధిత సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అందుబాటులో ఉంటానని, రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు.

నాగప్ప చెరువు కట్టకు మరమ్మతులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ గ్రామంలో గ్రామానికి చెందిన చంద్రగౌడ్ నాగప్ప చెరువు కట్టను ధ్వంసం చేయగా, ఇరిగేషన్ ఏఈ ఆనంద్ ఫిర్యాదు మేరకు పోలీసులు చంద్రగౌడ్‌పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా బుధవారం ఇరిగేషన్ ఏఈ ఆనంద్ వ్యవసాయదారులకు ఇబ్బంది కలగకుండా చెరువు కట్టకు మరమ్మతులు పనులు చేపట్టారు. అనంతరం ఏఈ మాట్లడుతూ.. చెరువు కట్టలను ఎవరైనా ధ్వంసం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంటల సర్వే నమోదు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వర్‌రావు వరి పంటల సర్వే నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండలంలో అధికంగా రైతన్నలు వరి పంటలు వేయడం వలన పంటలకు సోకే వ్యాధుల నివారణ జాగ్రత్తలపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. అలాగే చాలామంది రైతులు వరి పంటలకు క్రిమి కీటకాల నివారణ కోసం పిచికారీ చేస్తున్నందున జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండల విస్తీర్ణ అధికారిని జ్యోతి సైతం ఆమెకు కేటాయించిన రెవెన్యూ గ్రామ శివారులలోని వరి పంటలను పరిశీలించడమే కాకుండా సర్వే, నమోదు చేస్తున్నట్టు వివరించారు.

విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో సర్పంచ్ గౌరాజి లలిత రాఘవేందర్ విద్యార్థినీ విద్యార్థులకు యూనిఫాంలను బుధవారం అందజేశారు. ప్రభుత్వం అందించే ఏకరూప దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేసినట్టు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు గులాం హైమద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన మీసేవా నిర్వాహకులు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో దోమకొండ ఇంచార్జ్ తహసీల్దార్ శాంత బదిలీపై రాజంపేట్ మండలానికి వెళ్తున్నందున మీ సేవ నిర్వాహకులు, వీఆర్ఏలు బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శాంతా మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉద్యోగుల బదిలీలు సహజమని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, వీఆర్ఏలకు సూచించారు. అనంతరం దోమకొండ ఇంచార్జి తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ తహసీల్దార్ కౌశికను, బదిలీపై రాజంపేటకు వెళుతున్న ఇంచార్జి తహసీల్దార్ శాంతను సన్మానించారు. కార్యక్రమంలో సాప శ్రీనివాస్, బీస్ రవి, దేవరగట్టు రాజేశ్వర్, పోతుల రాజు, ఆర్ఐ మహేందర్, కంప్యూటర్ ఆపరేటర్లు రాజు, రఘువీరప్రసాద్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు మరువలేనివి

- వర్ధంతి సందర్భంగా నివాళి

నవతెలంగాణ-బోధన్/తాడ్వాయి



తాడ్వాయి : ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి

రాష్ట్ర ముఖ్యమంత్రిగా, సినీ చరిత్రలో నటసార్వభౌముడిగా నందమూరి తారకరామారావు అందించిన సేవలను మరువలేమని కమ్మ సంఘం నాయకులు అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని కమ్మ సంఘంలో ఆయన వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఎన్టీఆర్ ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేశారని, నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బుద్దె రాజేశ్వర్, మండల అధ్యక్షులు నరసయ్య, కమ్మ సంఘం అధ్యక్షులు పళ్లెంపాటి, టీడీపీ నాయకులు హనుమంతరావు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజివాడిలో ఎన్టీఆర్ 27వ వర్ధంతి

తాడ్వాయి : మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో ఎన్టీఆర్ 27వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు దేమే కమ్మరి రాజు మాట్లాడారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు దేమే కమ్మరి రాజు, నాయకులు పాల్గొన్నారు.

బైపాస్ రహదారి భూసేకరణలో

అవకతవకలపై ఫిర్యాదు

నవతెలంగాణ-బోధన్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, రైతులు

సాలూర మండల సమీపంలో ప్రభుత్వం బోధన్-నర్సి బైపాస్ రోడ్డు నిర్మాణానికి చేపట్టిన చర్యలలో భాగంగా అధికారులు భూసేకరణ చేపట్టారు. దాంతో కొంతమంది రైతులకు చెందిన భూములు ఈ రహదారి నిర్మాణంలో కోల్పోతున్నారు. ఈ భూసేకరణలో అవకతవకలు జరిగాయని, సేకరించిన భూమికి నోటీసులో తక్కువ చూపించి రోడ్డు కోసం ఎక్కువ భూమి తీసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. భూ సేకరణలో నష్టపోయిన రైతులకు తక్షణమే న్యాయం చేయాలని, భూ సేకరణలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బాధిత రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య మాట్లాడుతూ.. బోధన్-నర్సి హైవే రోడ్డులో సాలురా గ్రామంలోని సన్న, చిన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణ నోటీసులో తక్కువ భూమి చూపించి ఎక్కువ భూమి తీసుకుంటున్నారని విమర్శించారు. భూసేకరణపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసే వరకు రోడ్డు పనులు ఆపాలని డిమాండ్ చేశారు. భూసేకరణ నష్ట పరిహారం చెల్లించిన తర్వాతనే రోడ్డు పనులు ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చి అమలు చేయలేదని అన్నారు. రోడ్డు కోసం చేసిన సర్వేలో లోపాలు ఉన్నాయని, సర్వే చేసిన అధికారులు ఒత్తిడులకు తలొగ్గి భూసర్వే చేశారని విమర్శించారు. ఫలితంగా చిన్న, సన్న కారు రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ఆర్డీఓ రాజేశ్వర్ తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భూసేకరణ బాధిత రైతులు దార్శభూమన్న, గంగామణి, చిన్న భూమన్న, ప్రజా సంఘాల నాయకులు గంపల పోశెట్టి, షేక్ నజీర్, దేవదాసు, లక్ష్మణ్ గౌడ్, నారాయణ, శంకర్, సురేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు మృతి

నవతెలంగాణ-పిట్లం



మృతిచెందిన శేఖర్

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి సిద్ధాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిల్లర్గి గ్రామానికి చెందిన అంతగొని శేఖర్ (23) పిట్లం-బాన్సువాడ రహదారి సిద్ధాపూర్ గ్రామ శివారులో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను మోటర్ సైకిల్‌తో ఢీకొట్టగా యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని

ఉరేసుకుని భర్త ఆత్మహత్య

నవతెలంగాణ-పిట్లం

భార్య పుట్టింటికి వెళ్లిందన్న మనస్థాపంతో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ లింబాద్రి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పల్లపు కృష్ణ (31) తన భార్య జ్యోతిక పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తాను ఒంటరి తనంతో జీవితం మీద విరక్తి చెంది బుధవారం సాయంత్రం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా మృతునికి తాత, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య జ్యోతిక ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ స్టేజి వద్ద మహిళ మృతి చెందినట్టు ఎస్ఐ రాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన కాపర్ల వనమ్మ (48) రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. డ్రైవింగ్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు తెలిపారు. ఆర్గొండ రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చెసుకున్నారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మతాల మాటున దాడులు సిగ్గుచేటు

- టీచర్‌ను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఆర్డీఓకు వినతి

నవతెలంగాణ-బోధన్



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కోటగిరి మండల కేంద్రంలో ప్రభుత్వ టీచర్ మల్లికార్జున్‌పై మతోన్మాద శక్తులు తీవ్రంగా అవమానించి దాడి చేసిన ఘటనలో నిందితులను తక్షణమే అరెస్టు చేసి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం పాలన అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్ మాట్లాడుతూ.. ఒక ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయునిపై మతాల మాటున దాడులు చేయడం సిగ్గు చేటని అన్నారు. దేశంలో మతతత్వవాదుల ఆగడాలు, అరాచకాలు రోజురోజుకు పెరుగుతున్నాయని దానిని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా పోలీసు శాఖ నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. దేశంలో దళిత, మైనారిటీ వర్గాలపై మరోసారి ఇలాంటి మతతత్వాలు దాడులు జరగకుండా ప్రభుత్వం కఠినమైన నిబంధనలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగం, షికారి శ్రీనివాస్, దండు సాయిలు, షేక్ అజీమ్, శంకర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, డీసీఎం ఢీ..

- ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఆటో, డీసీఎంను ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఎల్లారెడ్డిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్ గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తి ఆయన ఆటో తీసుకొని ఎల్లారెడ్డికి వెళ్తుండగా మార్గమధ్యలో మల్లాయపల్లి గేటు వద్ద మెదక్ నుంచి ఎల్లారెడ్డి వెళ్తున్న డీసీఎం ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడగా స్థానికులు ఆటోని పక్కకు నెట్టి ఆటోలో ఉన్న శ్రీనును చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

అక్రమ కట్టడాలను కూల్చివేస్తాం

- డీఎల్పీఓ సురేందర్
- ఆక్రమణకు గురైన స్థలం పరిశీలన

నవతెలంగాణ-లింగంపేట్



వివరాలు తెలుసుకుంటున్న డీఎల్పీఓ

అక్రమ కట్టడాలను కూల్చివేస్తామని డీఎల్పీఓ సురేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన వారికి ముందస్తుగా నోటీసులు జారీ చేసి.. అనంతరం వినకుంటే చట్టపరంగా కూల్చివేస్తామని ఎల్లారెడ్డి డీఎల్పీఓ సురేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సర్వే నంబర్ 983లో ఐదు ఎకరాల స్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేటాయించగా.. ఇందులో కొందరు ఏకంగా ఇల్లు నిర్మాణం చేపట్టారని ఫిర్యాదు రావడంతో ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. అక్రమంగా నిర్మాణం చేపట్టిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే నోటీసులు జారీ చేయాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు. అలాగే లింగంపేట్ గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. కార్యదర్శి రాజేందర్, కళాశాల లెక్చరర్లు రాజయ్య, శివకుమార్ తదితరులున్నారు.

తల్లిదండ్రుల చెంతకు.. తప్పిపోయిన బాలుడు



తల్లిదండ్రులను చేరిన బాలుడు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు ఎల్లారెడ్డి పోలీసులు. బుధవారం పిట్లం మండలంలోని వడ్లం గ్రామానికి చెందిన విజయ్, ప్రేమ ఎల్లారెడ్డి పట్టణానికి తమ బంధువుల ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం బాలుడు అశ్విత్ కాలనీలో ఉన్న కిరాణం దుకాణానికి వెళ్లారు. అంతలోనే బాలుడు దారి తప్పిపోయి ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక ఏడుస్తూ ఉండడంతో కాలనీవాసులు బాలుడిని గమనించి పోలీసులకు అప్పగించారు. సమాచారం తెలుసుకున్న బాలుడిని తల్లిదండ్రులు పోలీసులు అప్పగించారు. బాలుని క్షేమంగా అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు అభినందించారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలోని లింబూర్ సర్పంచ్ మధుకర్ పటేల్ ఇటీవల టు వీలర్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు ప్రమాదానికి గురవడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారం బుధవారం లింబూర్ గ్రామాన్ని సందర్శించి, గాయపడ్డ సర్పంచ్ మధుకర్ పటేల్‌ను పరామర్శించారు. ప్రమాదం జరిగిన ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే లింబూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన మద్నూర్ మండల మాజీ ఎంపీపీ భీమ్‌రావు ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని కలిసి సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మద్నూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్, లింబూర్ గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
4
గురువారం 19 జనవరి 2023

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు



నవతెలంగాణ-ముప్కాల్

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీలు బుధవారం ముగిశాయి. మంగళవారం రాత్రి పోటీలు ప్రారంభమవగా బుధవారం ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.పోటీల్లో ప్రథమ బహుమతి రెడ్డీస్ యూత్ (ముప్కాల్), ద్వితీయ స్థానం గాంధీ హరిజన సంఘం (ముప్కాల్) నిలిచింది. కార్యక్రమంలో చైతన్య యువజన సంఘం అధ్యక్షులు గద్దల గంగారాం, గౌరవ అధ్యక్షులు అంజయ్య, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.గంగాధర్, టి.సాయన్న, పీడీ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కోళ్లుతరలిస్తున్న వ్యాన్



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో డివైడర్‌ను ప్రమాదవశాత్తు కోళ్ల తరలిస్తున్న వ్యాన్ ఢీకొన్న ఘటన బుధవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఎస్ఐ గణేష్ వివరాల ప్రకారం బాన్సువాడ నుండి హైదరాబాద్‌కు తెల్లవారు జామున కోళ్లను తరలిస్తున్న వ్యాన్ ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని దేవుని పల్లి సమీపం వద్ద డివైడర్‌కు ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేవు. డివైడర్ పూర్తిగా ధ్వంసం అయింది. పల్టీ కొట్టిన వ్యాన్‌ను జేసీబీతో పక్కకు పెట్టించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చేసినట్టు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

తెలుగు వారి గుండెల్లో.. ఎన్టీఆర్

- వర్ధంతి సందర్భంగా నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్‌సిటీ : ఎన్టీఆర్ తెలుగువారికి రాజకీయ ఓనమాలు నేర్పిన వ్యక్తిగా చిరకాలం తెలుగు వారి గుండెల్లో ఉంటారని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలో ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబికా సత్యనారాయణ ఆధ్వర్యంలో దుబ్బలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ పాల్గొని అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరానికి వెళ్ళి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కొందరు పార్టీ నాయకులు రక్త దానం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు దేగాం యదాగౌడ్ మాట్లాడుతూ.. ప్రపంచ నలు మూలల కి తెలుగువారి కీర్తిని తీసుకెళ్లిన మహానుభావుడని, తెలుగుదేశం పార్టీని స్థాపించిన అది కొద్ది నెలల్లోనే అధికారంలోకి వచ్చి పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి, మహిళ సాధికారికత పెద్ద పీట వేశారని అన్నారు. తెలంగాణ లో టీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ మద్యం మత్తులో ప్రభుత్వాలు నడపాలని చూడడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వాలు ఆదాయ సృష్టి లేకుండా అప్పులతో నడపడం రాబోయే తరాలకు ఆర్థిక గండంగా మారుతుందని తెలిపారు. పార్టీ పూర్వ వైభవంకోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ కమిటీ నాయకులు రెంజర్ల సురేష్, వినోద్ కుమార్, బ్రహ్మనంద చారి, వీర చారి, రాష్ట్ర కమిటీ నాయకులు కోయేడి నర్సింలు, ప్రతాప్ రెడ్డి, సంజయ్, అనుబంధ సంఘ అధ్యక్షులు అహ్మద్, కల్లెడ గంగాధర్,జక్కుల రాజేశ్వర్, మండల కమిటీ అధ్యక్షులు జనార్దన్ చారి, అర్బన్ నాయకులు లవంగ రాజు,శంకర్, ప్రకాష్, స్వామి, హరీష్ చౌదరి,నర్సయ్య, హరీష్, గణేష్, లక్ష్మీ బాయి, చెన్నమ్మ, రాములు,శ్రావణ్, నారా గౌడ్, యూసుఫ్, రవి క్రిష్ణ రెడ్డి, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వారి ఖ్యాతిని చాటిన మహనీయుడు

తెలుగు వారి ఖ్యాతిని దేశంలో నలుమూలల చాటి చెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని కమ్మ సంఘం అధ్యక్షులు కలగర వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కావూరి కృష్ణారావు అన్నారు. బుధవారం ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా మాధవ నగర్‌లో గల కమ్మ సంఘంలో కమ్మ సంఘం అధ్యక్షులు కలగర వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కావూరి కృష్ణారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ చిత్రపటానికి కమ్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కలగర శ్రీనివాసరావు, కమ్మ సంఘ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లాలో పెద్ద ఎత్తున రక్తదానం చేసి అన్నదానం చేసి ఎన్టీఆర్‌పై అభిమానాన్ని చాటుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా కమ్మ సంఘంలో రక్తదానం, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రక్తదాన శిబిరంలో 100 మంది పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాన శిబిరానికి తోడ్పడిన రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులకు, రోటరీ క్లబ్, నిజామాబాద్ ప్రతినిధులకు కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి వెనిగర్ల సురేష్, డైరెక్టర్లు గందు రాము, కిషోర్ కుమార్, రవీంద్రనాథ్ ఠాగూర్, అప్పన్న లక్ష్మి, రామ కృష్ణ, నాయుడు ఆంజనేయులు, సాంబశివరావు, బాలాజీ, సుబ్బారావు, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు, కార్పొరేటర్ ప్రమోద్ కుమార్, కొత్త సర్పంచ్ కొత్తపల్లి సర్పంచ్ సుబ్బారావు, కమర్షియల్ అధ్యక్షులు సీతారా మయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు మండల రామకృష్ణ, కమ్మ సోదరులు ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


నిజామాబాద్‌సిటీ : టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి

మోపాల్ : తెలంగాణ తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదాగౌడ్ గారి ఆధ్వర్యంలో మోపాల్ మండల కేంద్రంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కమిటీ నాయకులు రేంజర్ల సురేష్, వినోద్, వీరాచారి, బ్రహ్మానంద చారి, రాష్ట్ర అనుబంధ కమిటీ నాయకులు పిట్ట గంగన్న, కోయెడి నర్సింలు, ప్రతాప్‌రెడ్డి, సంజయ్, శంకర్, హరీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు

ముప్కాల్ : మండల కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గ్రామస్తులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాములు, రాజన్న, ముస్కు ముత్తెన్న, దాయనంద్, లోక రాములు, లింగపురం చిన్నయ్య, జనార్దన్, కొమ్ముల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో...

డిచ్‌పల్లి : మండలంలోని ధర్మారం (బి) లో ఉమ్మడి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలను బుధవారం తెలుగుదేశం సీనియర్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ముందుగా గ్రామ పంచాయతీ ముందు ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


మోపాల్ : పూలమాలలు వేస్తున్న నాయకులు

వినియోగదారుల సంక్షేమ కౌన్సిల్‌కు
నలుగురి పేర్లు ఎంపిక చేయాలి

- రెవెన్యూ ఆదనపు కలెక్టర్ చంద్రమోహన్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా వినియోగదారుల సంక్షేమ కౌన్సిల్ కు రాష్ట్రానికి ఒక పేరు, జిల్లాలో నలుగురు పేర్లు ఎంపిక చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లో బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా వినియోగదారుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడారు. జిల్లా వినియోగదారుల సంక్షేమ కౌన్సిల్ లో ఎంపిక చేసే నాలుగు పేర్లలో ఒక మహిళా పేరు ఉండే విధంగా చూడాలని సూచించారు. వినియోగదారుల హక్కులను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. జిల్లా వినియోగదారుల సంక్షేమం కోసం ఎంపికైన ప్రతినిధులు కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారిని పద్మ, అధికారులు, జిల్లా వినియోదారుల సంఘం అధ్యక్షురాలు బి. సువర్ణ, ప్రతినిధులు తోకల కిషన్, రావుల ప్రభాకర్ పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కామారెడ్డి దేవునిపల్లిలో గల మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలకు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎండి ఇంతియాజ్ అలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్య భోజన వసతి సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నిత్యవసరాలకు అవసరమయ్యే సదుపాయాలను సమకూర్చామని, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, నోట్ బుక్స్ ,కాస్మెటిక్ కిట్, స్టేషనరీ కిట్, అనేక అవసరాలను కళాశాలనే అందిస్తున్నట్టు తెలిపారు. కళాశాలలో అందించే నాణ్యమైన విద్యను ఉచిత భోజన వసతి సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీసీలో, బైపీసీ గ్రూపులలో మైనార్టీ విద్యార్థులకు 26, బిసి5, ఎస్సీ, ఎస్టీలకు రెండు చొప్పున క్రిస్టియన్ మైనారిటీలకు రెండు, జైన్, బౌద్ధులకు ,రెండు చొప్పున సీట్లు కేటాయించినట్టు తెలిపారు. ఓసికి ఒక సీట్ కేటాయించినట్టు తెలిపారు. కావున కామారెడ్డి జిల్లాలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మైనార్టీ నాన్ మైనార్టీ విద్యార్థులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవలసిందిగా ప్రిన్సిపాల్ సూచించారు. దేవునిపల్లిలో గల మైనార్టీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుకు గాను ఆధార్ కార్డ్, ఫోటో, సర్టిఫికెట్ తీసుకొని రావాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాల ప్రిన్సిపల్ 8978847884 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కంటి వెలుగుకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-భిక్కనూర్/ఆర్మూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగు గురువారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం ఎంపీడీవో అనంతరావు మండలంలోని పెద్దమల్లారెడ్డి లక్ష్మీ రాజలింగం, అంతంపల్లి గ్రామ సర్పంచ్ మధుమోహన్ రెడ్డి లు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించి వైద్యులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఎంపీపీ గాల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ రాజా గౌడ్, ఎంపీటీసీలు సాయ గౌడ్, మంజుల రాములు, కార్యదర్శి లక్ష్మీ, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నాలుగు వార్డులో ఏర్పాట్లు పూర్తి

ఆర్మూర్ : మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్ నాలుగో వార్డులో కంటి వెలుగు ఏర్పాట్లు పూర్తయినాయని నేటి నుండి 18 సంవత్సరాలు పైబడిన వారు అందరూ ఎస్సీ సంఘంలో ఏర్పాటు చేసినటువంటి కంటి వెలుగు శిబిరానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకొని అవసరమైన వారు కంటి అద్దాలు తీసుకోవాలని గోవింద్ పెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని మానస ం సూచించారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు వైద్యాధికారిని రుబీనా పిహెచ్ఎన్ సుగుణ, హెల్త్ సూపర్వైజర్లు ఆనవాల రవి, ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, గణేష్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్


జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి బాధ్యతలు చేపట్టి మూడు సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా పట్టణానికి చెందిన సామాజిక సేవకులు పట్వారీ తులసి కుమార్ గురువారం మర్యాద పూర్వకంగా కలెక్టర్ ఆఫీస్ లో కలిశారు. శాలువాతో సన్మానించారు. నారాయణ రెడ్డి మొదట జిల్లా కి వచ్చి సైకిల్ పై సాధారణ వ్యక్తి లా వెళ్లి తనిఖీ, ప్రభుత్వ పాఠశాలో విద్యార్థులతో సంభాషణ, 108 అంబులెన్స్ పరిశీలన, దేవాలయల సందర్శన, హరితహారం, గ్రంథాలయం, విద్య ఆరోగ్యం, ప్రజావాణి, కోవిడ్ సమయాల్లో ప్రజలతో మమేకమైన సందర్భాలు, తీవ్ర వర్ష సమయాల్లో ప్రజల వద్దకు వెళ్ళి సమస్యలు తీసుకోవడం ఇలా ఎన్నో వివిధ సేవ అంశాల 40 చిత్రాలు ఫోటో గ్యాలరీ రూపంలో రూపకల్పన చేసి కలెక్టర్ నారాయణ రెడ్డికి అందజేశారు. ప్రతీ ఒక్కరి సమస్యను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తూ అందరికీ స్ఫూర్తి గా నిలిచిన కలెక్టర్ నారాయణ రెడ్డి గారికి పట్వారీ తులసి కుమార్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. పట్వారీ తులసి సేవలు నేటి యువతరానికి ఆదర్శం అని ఈ సందర్భంగా ఫోటో గ్యాలరీ రూపకల్పనను అభినందించారు.


కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన తులసీకుమార్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఎడపల్లి మండల పరిధిలోని సాతాపూర్ గేట్ సమీపాన బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ ఇలియాస్ వివరాల ప్రకారం.. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల గొల్ల గుడిసె గ్రామానికి చెందిన ఇమామ్ (30) బైక్‌పై నిజామాబాదు నుండి బోధన వైపు వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు ఇమామ్ ద్విచక్ర వాహనం డివైడర్‌కు బలంగా ఢీకొనడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎడపల్లి ఏఎస్ఐ ఇలియాస్ తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. ఇమామ్ ప్రైవేట్ గా ఎలక్ట్రీషన్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిచుకుండేవాడని, దీంతో కుటుంబీకులు పెద్దదిక్కు కోల్పోయినట్టు అయింది. మృతునికి భార్య ఓ కూతురు, కుమారుడు ఉన్నారు.


మృతిచెందిన ఇమామ్

గల్ఫ్ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన దండుగుల పోశెట్టి ఈ నెల 9వ తేదీనా దుబాయ్‌లో ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఈ సందర్భంగా వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా నాయకత్వాకి విషయం తెలియడంతో బుధవారం ఆ కుటుంబాన్ని కలిసి పరామర్శించి ఆ కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు మాట్లాడుతూ దండుగుల పోశెట్టి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా మృతుని కుటుంబానికి ప్రభుత్వం 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఒక డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో జిల్లా కార్యదర్శి ద్యారంగుల కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఇడగొట్టి చిన్న ఒడ్డెన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఎత్తరి చందర్, జిల్లా కమిటీ సభ్యులు గుంజె పాపన్న తదితరులున్నారు.

వ్యవసాయంలో
కార్పొరేట్ శక్తులను తరిమికొడదాం

- ఏఐకేఎంఎస్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వ్యవసాయంలో కార్పొరేట్ శక్తులను తరిమికొడదామని ఏఐపీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. చంద్రశేఖర్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రం ఎన్.ఆర్ భవన్, కోటగల్లిలో అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా జనరల్ కౌన్సిల్‌లో సంఘం జిల్లా అధ్యక్షులు కే.గంగాధర్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జనరల్ కౌన్సిల్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపికెఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఆర్. చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతు, వ్యవసాయ కూలీ భూమిని, ఊరును వదిలేసి వలస పిట్టలయ్యారని అన్నారు. వ్యవసాయ రంగాన్ని గుత్త పెట్టుబడిదారులకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా రైతులు ఆందోళన చేస్తున్నారన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను శాశ్వతంగా రద్దు చేయాలని, పంటల కనీస మద్దతు ధరను ప్రకటించాలని, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐకెఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ మాట్లాడుతూ... పసుపు ఎర్ర జొన్న ఉద్యమం, పోడు భూముల పోరాటం, మార్కెట్ సమస్యల కోసం ఉద్యమాలు చేశామన్నారు. ఏఐకేఎంఎస్ నుండి అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘంగా ఏర్పడడం రైతాంగ ఉద్యమానికి బలాన్ని చేకూరుస్తాయని ఆయన ఆశ భావం వ్యక్తం చేశారు. రైతాంగమంతా కనీస ధరల చట్టాన్ని చేసేంతవరకు ఉద్యమించాలని, వ్యవసాయ కార్మికులంతా ఉపాధి కల్పన కోసం వ్యవసాయ కార్మిక చట్టాన్ని చేసేంతవరకు ఉద్యమించాలని అన్నారు. అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.గంగాధర్, అఖిల భారత ప్రగతిశీల రైతు సంగం సహాయ కార్యదర్శి బి. దేవారం తదితరులు ప్రసంగించారు. అనంతరం అఖిల భారత ప్రగతిశీల కార్మిక సంఘం, జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా సిహెచ్ సాయగౌడ్ జి.కిషన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్ సురేష్, గుమ్ముల గంగాధర్ లను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు

ఖమ్మం సభకు తరలిన
ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-మోపాల్/డిచ్‌పల్లి

ఖమ్మం సభకు మోపాల్ మండలం నుండి టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మొచ్చా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జడ్పిటిసి కమల నరేష్, ఎంపీపీ లతా కన్నీరాం, మోపాల్ మండల సర్పంచులు, సిద్ధార్థ, సాయి రెడ్డి, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, రైతు సమన్వయ కమిటీ సభ్యులు బుధవారం తరలివెళ్లారు.

డిచ్‌పల్లి : ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీ మొట్టమొదటి మహాసభకు టీఎస్ఆర్టిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో బుధవారం తరలివెళ్లారు. ఇందల్‌వాయి, డిచ్‌పల్లి మండలాల్లోని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు ముందస్తుగా హైదరాబాద్‌లో ఆర్టిసి చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి ఖమ్మం బయలు దేరారు.తరళి వెళ్ళిన వారిలో ఎంపీపీ బాదవత్ రమేశ్ నాయక్, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబరీ మోహన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చిలివేరి గంగా దాస్, మండల నాయకులు పాశం కుమార్, అరేటి రఘు, బంజారా సదర్ నాయక్ రాజు నాయక్, సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు శక్కరి కోండ కృష్ణ, దాసరి లక్ష్మి నర్సయ్య,దండుగుల సాయిలు అమీర్ ఖాన్, తోపాటు తదితరులు పాల్గొన్నారు.


డిచ్‌పల్లి : బాజిరెడ్డికి పుష్పగుచ్చం అందజేస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి పోరాడిన
వెంకట్‌రెడ్డి ధన్యజీవి


మాట్లాడుతున్న పద్మ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సమస్యల పరిష్కారానికి పోరాడిన వ్యక్తి ధన్యజీవి అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ అన్నారు. నిజామాబాద్ నగరం కాలూర్ రోడ్‌లో గల ఫిట్టర్ యూనియన్ ఆఫీసులో కామ్రేడ్ గడ్డం వెంకట్ రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఏఐటీయూసీ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అధ్యక్షతన సభ ఏర్పాటు చేశారు. జిల్లా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం చేసిన వారిలో ఒకరిగా ప్రజా సంఘాలు, ముఖ్యంగా కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించారని తెలిపారు. నిరుపేదలకు అండగా వారి సమస్యల పరిష్కారానికి పోరాడిన వ్యక్తి అని పేర్కొన్నారు. నిరుపేదలందరికీ ఆహార హక్కు ను పోరాడి సాధించడమే గడ్డం వెంకట్ రెడ్డి కి నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు భూమయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఓమయ్య, గడ్డం మురళి(గడ్డం వెంకట్రెడ్డి అబ్బాయి), సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు పార్టీ కార్యవర్గ సభ్యులు రాజన్న, రాజిరెడ్డి, రాజేశ్వర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాగరులు వాడే వస్తువుల పంపిణీ

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని యంచ గ్రామ మాజీ ఉపసర్పంచ్ లాలూ యాదవ్ బ్యాగరులకు గడ్డపారలు, గుల్లలు, కుండ పగలగట్టే సుత్తిలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లాలు యాదవ్ మాట్లాడుతూ దహన సంస్కారాలు జరిపే బ్యాగరులకు తన వంతుగా సహకార అందించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.